# త్యాగం చెల్లించిన మూల్యం



కథానిక

రాజేశ్వరీ యం.వి. కృష్ణరావు

"అమ్మా, ఆనందరావన్నయ్యా శారదా కులాసాగా ఉన్నారా" అని అడిగాడు ఇంట్లో అడుగు పెట్టిన కొద్దినిముషాలలోనే ప్రకాశరావు. శారద క్షేమవార్తలు తెలుసుకోవడానికి అతని కెందుకో బహుతొందరగా ఉంది. "బాగానే ఉన్నారు. వాళ్లు ఇప్పుడు కాకినాడలో ఉన్నారు. ఆనందరావు బి. ఎల్. పాస్ అవగానే అక్కడే ప్రాక్టీసు పెట్టాడు. వాళ్ళకి ఒక కొడుకూ ఒక కూతురూను. చూడముచ్చటగా ఉంటారుసుమా పిల్లలు." అంది ప్రకాశరావు తల్లి శాంతమ్మ. "అవును. శారదపిల్లలు అందముగా ఉండరూ మరి! శారద అందాలరాసి, గుణాలకుప్ప" అనుకున్నాడు ప్రకాశరావు మనస్సులో. శాంతమ్మకొడుకు మదరాసులో డాక్టరు కోర్సు చదివి, జమీందారు బిడ్డయిన ఒక క్లాసుమేటు సహాయంతో అమెరికా వెళ్ళాడు. అయిదు సంవత్సరాలు అచ్చట సర్జరీలో అనుభవం గడించిన తరువాత తిరిగి వచ్చాడు స్వగ్రామమయిన పెద్దాపురానికి. ఆనందరావు, ప్రకాశరావులు అన్నదమ్ముల బిడ్డలు. ఆనందరావుతండ్రి ప్రయోజకుడై పంపకములలో తనకు వచ్చిన ఇరువది ఎకరముల భూమిని నూరు ఎకరములు చేశాడు. కొడుకుకి బి. ఎల్. చెప్పించాడు. ప్రకాశరావుకి తండ్రి పదిసంవత్సరములప్పుడే చనిపోయాడు. అయినా తల్లి శాంతమ్మ కొంత ఆస్తి ఖర్చుచేసి కొడుకుని డాక్టరుని చెయ్యాలనే పట్టుదలతో అతనికి ఎం. బి. బి. యస్. చెప్పించింది. శారద, ప్రకాశరావు, ఆనందరావుల మేనత్తకూతురు. అందమైనపిల్ల. తలిదండ్రులు స్కూల్ ఫైనల్ వరకూ చదువు, సంగీతము చెప్పించారు. ఆనందరావు ప్రకాశరావంత చక్కటివాడు కాకపోయినా, ఆస్తివిషయములో అతడు మంచి స్థితిలో నుండుటచే శారద తలిదండ్రులు ఆమెను ఆనందరావుకిచ్చి వివాహము చేశారు. ప్రకాశరావు అమెరికా వెళ్ళిన మరుచటి సంవత్సరమే ఆమె వివాహము జరిగింది. ప్రకాశరావుకి శుభలేఖ వెళ్ళింది. ఆ శుభలేఖ అతనికి గొడ్డలిపెట్టులాగయింది. ఆ రోజు అంతా అతని మనస్సు మనస్సులో లేదు. తానెక్కడున్నాడో, ఏమిచేస్తున్నాడో, భోజనం చేశాడో లేదో కూడా తెలుసుకోలేనంత కలవరపడిపోయాడు. శారదతలిదండ్రులుశారదనుతనకిస్తానని ఎప్పుడూ వాగ్దానము చేయలేదు. శారదను ఇదివరకు తనుఎన్నిసార్లో కలుసుకున్నాడు. మదరాసు నుంచి సెలవులకు ఇంటికెళ్ళినప్పుడల్లా వీలయినన్నిసార్లు శారదను చూడ్డానికి ఆమెయింటికి వెళ్ళి వీలయినంతసేపు ఆమెతో గడిపేవాడు. ఆమె ఎంతో సరళస్వభావము కలది. తననెంతో గౌరవించి ఆదరించేది. ఆమె గొంతెత్తిపాడితే అతని వళ్ళు పరవశమయిపోయేది. అక్కడే, ఆ క్షణంలోనే ఆమెసాన్నిధ్యంలో తను మరణిస్తే ఎంత బాగుండును అని అనుకునేవాడు. కాని ఆమె ఎప్పుడూ తనను ప్రేమిస్తున్నానని కాని, తనను పెండ్లి చేసుకుంటానని కాని చెప్పలేదు. అయినా

ఎందుకు తనకీ తీరనిబాధ! ఏమిటీ అంతులేని ఆవేదన! తనకు ఆమెపై బ్రహ్మాండమైనంత ఇష్టము ఉండవచ్చును. తనదృష్టిలో ఆమెయే స్త్రీ అనే భావముంటే ఉండుగాక. ఆమెకోరకు ఎటువంటి త్యాగమైనా చేసే వెర్రి, ఎటువంటి కష్టాలయినా పడగల శక్తి తనకుంటే ఉండుగాక. అసలు తన మనస్సు ఆమెకే ఎప్పుడూ తను విప్పి చెప్పలేదే. ఎప్పుడైనా చెప్పకుంటే ఆ దయామయి కనికరించే దేమో! ఇప్పుడు బాధపడి ఏమి ప్రయోజనం? ఇప్పుడు తన మనస్సు విప్పి ఎవరితోనైనా చెప్పుకున్నా "ఎంత అమాయకుడవు! ఆస్తిగల ఆనందరావుని విడిచి నీకిస్తారా పిల్లని?" అని తననే హాస్యము చేస్తారుగాని ఏం ప్రయోజనం ఉంటుంది? జరగవలసినదేదో జరిగిపోయింది. ప్రకాశంపు మాత్రం ఎన్నాళ్లు బెంగ పెట్టుకుంటాడు? అయినా. మొదటి రోజు ఉన్న బాధ, రెండవరోజు ఉన్న బాధ మూడోరోజు ఉంటే మానవు లేవిధంగా కష్టాల్ని తట్టుకుని బ్రతుకుతారు? కాలం గడిచినకొద్దీ కష్టాల్ని మరవడం అనేది లోకంలో అందరికీ ఉండనే ఉంది.

ప్రకాశరావు అమెరికాలో ఉన్నన్నాళ్ళూ, శారద విషయమేమీ అతనికి తెలియనే లేదు. తల్లికి జాబు వ్రాసినప్పుడు ఆమె క్షేమాన్ని గురించి ప్రస్తావించా లనుకునేవాడు. కాని దైవికంగా తనకు జరిగిన అన్యాయం జ్ఞాపకం రాగానే హృదయంలో ఏర్పడిన గాయము రేగి నట్టయేది. ఇంక ఆమె పేరు కాగితంమీద పెట్టడానికి అతనికి ధైర్యం చాలేదికాదు. కళ్ళు మూసుకుని, దురదృష్టానికి తనని తనే ఓదార్చుకుని తిరిగి రోజులు గడుపుతూ ఉండేవాడు. తల్లి చెప్పిన సమాధానం విని అతను కొంత సంతోషించాడు. "పోనీ, శారదైనా సుఖంగా ఉంది కదా, మంచి భర్తతోనూ, బిడ్డలతోనూ" అని. కాని తన మనస్సులో ఏదో తీరని బాధ, అంతులేని అశాంతి అలాగే ఒకప్రక్క అణిగిమణిగి ఉంటునే ఉన్నాయి. తనెందుకు జీవిస్తున్నట్లు? ఎవరికోరకు జీవిస్తున్నట్లు? బ్రతుకింత నిస్సారంగా ఉంటే ఎల్లా జీవించడం, ఎంత కాలము జీవించడం? అన్న ప్రశ్నలతో అతని బుర్ర వేడెక్కిపోయేది. తనిప్పు డెక్కడో ఒకచోట ప్రాక్టీసు పెట్టాలి. ఆలోచించాడు. ఎక్కడో ఎందుకు, ఆ కాకినాడలోనే పెడితే శారదనెప్పుడైనా కళ్లతోనైనా చూస్తూ ఉండవచ్చును. అంతేగా తనకు జీవితములో మిగిలిన దింక. ఒకరోజు తల్లితో చెప్పాడు తన నిశ్చయాన్ని. చదువుకు తల్లి అమ్మగా మిగిలిన ఆస్తిని అమ్మేసి, ప్రాక్టీస్‌కి కావలసిన పరికరాలు అన్నీ కొన్నాడు. ఒక మంచిరోజున తల్లితో బయలుదేరి కాకినాడ వెళ్లి కాపురం పెట్టాడు. డిస్పెన్సరీ ప్రారంభించాడు. రోగులు కుప్పతిప్పలుగా రావడం మొదలు పెట్టారు. తను ప్రాక్టీసు ప్రారంభించిన సంవత్సరం నాటికి, ఒక కారు కొన్నాడు. ఒక మేడ కట్టించాడు. కాని అతని అసంతృప్తి యథాప్రకారంగానే ఉంది. తల్లి అప్పుడప్పుడు "ఇంక పెళ్లిచేసుకోరా నాయనా! రోజుకి పదిమంది వచ్చిపోతున్నారు పిల్లనిస్తామని" అంటూండేది. "అల్లాగేలే. తొందరేమిటమ్మా, ఈ సంవత్సరం పోనీ" అంటూ ఉండేవాడు తల్లి మనసు నొప్పించడం ఇష్టంలేక. మనసులో మాత్రం "నాకు పెళ్ళేమిటి. ఛీ! నేనంత పనికిరాని వాడిని! ప్రపంచంలో ఐశ్వర్యము ఆనందాన్నిస్తుందంటూరు. కాని నేను సంపాదించగలిగిన దానిలో ఏదీకూడా నాహృదయానికి కొంచెమైనా ఆనందాన్ని ఇవ్వలేకుండా వుంది" అని అనుకునేవాడు.

శారద ఇంటికి వెళ్ళాలనే కోరిక ప్రతీదినం మనసులో బాధపెడుతూండేది. కాని రోజూ వెడితే శారద ఏమనుకుంటుందో, అన్నగారేమనుకుంటాడో అనే భయంతో వీలయినన్ని రోజులు గడిపి ఇంక ఉండలేనప్పుడు వారింటికి వెడుతూ ఉండేవాడు. వెళ్ళడంతోనే "ప్రకాశంబాబయ్య" అంటూ శారద కొడుకూ, కూతురూ తన వొళ్లో చేరి ముద్దుగా మాట్లాడేవారు. శారద కూడా చాలా ఆప్యాయంగా పలకరించి కాఫీ యిచ్చి మర్యాదచేసేది. ఆనందరావు యింట్లో వుంటే, "ఏరా, ప్రకాశం కనపడడమేలేదు? నువ్వెంతపని తొందరలో ఉంటేమాత్రం రోజూ కాసేపు రాకూడదూ?" అనేవాడు. "ఏమిటో అన్నయ్యా తీరిక ఉండడంలేదు. అయినా యింట్లో ఎవరికైనా కాస్త అస్వస్థగా ఉన్నప్పుడల్లా వస్తూనే ఉన్నానుగా" అనేవాడు.

శారద కాపురం చూడడానికి ముచ్చటగానే ఉండేది. భార్యాభర్తల అన్యోన్యానికి యేమీ లోటు ఉన్నట్టు కనపడదు. ఆనందరావు ప్రాక్టీసు ఓ మోస్తరుగా ఉంటోందనే చెప్పాలి. అప్పుడప్పుడు ఆనందరావు, తండ్రికి సొమ్ముకొరకు వ్రాయవలసివచ్చేది. వ్రాసినప్పుడల్లా కొద్దోగొప్పో సొమ్ము పంపేవాడు వాడితండ్రి. కాని మందలింపు జాబులు కూడా అప్పుడప్పుడు వ్రాస్తూనే ఉండేవాడు. ఆనందరావీ జాబుల కాస్తే లెక్కచేస్తున్నట్టు కనపడేవాడుకాడు. ప్రకాశరావు కప్పుడప్పుడు సందేహం కలిగేది. "అసలు శారద సుఖపడుతోందా, మనస్సులో బాధ పడుతోందా?" అని. ఆమె బాధపడడానికి తగినంత గొప్ప కారణాలేమీలేవు. భర్త ఎక్కువ అందగాడు కాకపోయినా కురూపికాడు. చదువుకున్నవాడు. పైగా కావలసినంత ఆస్తి ఉంది. ఈరోజు కాకపోతే రేపైనా అదంతా తమదేగా. పిల్లలు అదీయిదీ కావాలని పేచీ పెట్టినప్పుడు మాత్రం కొనియ్యలేకపోతే శారదకొంచెం బాధపడేది. మామగారికి తరుచు డబ్బుకోసం వ్రాయడము ఆమెకు ఇష్టముండేదికాదు. అందుకని ఇంట్లో యిబ్బందులు వీలైనంతవరకు భర్తకుకూడ చెప్పకుండా దాచిపెట్టడానికే ఆమె ప్రయత్నించేది. మరీఇబ్బందిగావుంటే ఆనందరావు తనంతట తానే తండ్రికి జాబు వ్రాస్తూండేవాడు.

ప్రకాశరావు వారానికి అథమం రెండుసార్లయినా శారద ఇంటికి వెడుతూండేవాడు. శారద పిల్లలతో కాలం గడపడం అతనికెంతో సంతోషంగా ఉండేది. వాళ్ళకేం కావాలో తెలుసుకుని వాళ్ళని బజారుకి తీసుకువెళ్ళి అడిగిన వాటికి రెట్టింపు కొనియిచ్చి యింటిదగ్గర దిగబెట్టేవాడు. అలా చేసినప్పుడల్లా శారద మందలిస్తూనే ఉండేది. "చూడు ప్రకాశం నువ్వు డబ్బు బాగా ఆర్జిస్తున్నావే అనుకో నువ్వు పెళ్ళి కావలసినవాడివి. కొంచెం డబ్బు ఆదా చేసుకోవాలి కాని ఇష్టమొచ్చినట్లల్లా ఖర్చు చేస్తే ఎల్లాగ?" అనేది. శారద అల్లా మాట్లాడుతూంటే ప్రకాశరావు కేదో తెలియని ఆవేదన, ఆనందంకూడా కలిగేవి. ఆమె అంతటితో ఊరుకోక "ఏం ప్రకాశం మాట్లాడవేం, ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు?" అని సూటిగా అడిగేది. "నేనూ అదే ఆలోచిస్తున్నా" అనేసి తప్పించుకునేవాడు.

రెండు సంవత్సరములు గడిచాయి. ఆనందరావు ప్రాక్టీసు యథాప్రకారంగానే ఉంది. శారద ఆరోగ్యమంత బాగాలేదు. ఆర్థిక పరిస్థితులు మెత్తిగా బాగాలేవు. తండ్రికి డబ్బుకొరకు జాబు వ్రాస్తే ఈసారి డబ్బురాలేదు. స్వయముగా తండ్రితో పరిస్థితులు చెప్పి సొమ్ము తెద్దామనే ఉద్దేశముతో బయలుదేరి పెద్దాపురం వెళ్ళాడు. అతను వెళ్ళిన మరునాడే శారదకు తీవ్రమైన జ్వరము వచ్చింది. శారద దాసి వెంటనే ప్రకాశరావుదగ్గరకు పరిగెత్తుకు వెళ్ళి చెప్పింది. ఆనందరావు ఊళ్ళో లేడనికూడా చెప్పింది. ప్రకాశరావు ఉన్నవాడున్నట్లు వెంటనే కారెక్కి పరిగెత్తుకుని వచ్చాడు. శారద వళ్లు తెలియని జ్వరముతో మంచంలో మూల్గుతోంది. పిల్లలిద్దరు దిగులుగా చెరోచోటా కూర్చున్నారు. ఆత్రంతో ఆమె మంచాన్ని సమీపించాడు. ఒక కుర్చీ దగ్గరగా లాక్కొని ఆమె మంచం ప్రక్కని కూర్చొన్నాడు. ఆమె నాడి పరీక్షించాడు. జ్వరము చాలా తీవ్రముగా ఉన్నట్టు గ్రహించాడు. ఆమె మెల్లిగా కనులు తెరిచి ప్రకాశం ముఖంలోకి చూచింది. "వచ్చావా? అవును. నువ్వు చాలా మంచివాడవు. ఇంత తొందరగా నువ్వు వస్తావని నాకు తెలుసు. చూడు, మీ అన్నయ్య ఊళ్లోలేరు. నేనా మంచాన్ని పడ్డాను. ఏమి జ్వరమో ఎన్నాళ్ళకు తగ్గుతుందో, పని మనిషి ఉందనుకో, అయినా పాపం పిల్లలు బెంగపడిపోతారు. నువ్వు పనులు త్వరగా ముగించుకుని వీలైనంతసేపు ఇక్కడే ఉంటూ ఉండు నేను లేచేవరకూ. చూశావా, నువ్వు పెళ్ళిచేసుకుని ఉంటే నాచెల్లెలు నాకిప్పుడెంతో సహాయం చేసేది." ఆమె మాటలు పూర్తిగా ముగించి అతనివైపు చూసేసరికి అతనికళ్లురెండు నీళ్ళతో నిండి ఉన్నాయి. ఆమెకేమీ అర్థంకాలేదు. "ఏం ప్రకాశం, నీమనస్సు నేను నొప్పించానా?" అని విచారంగా అడిగిందామె. "లేదు శారదా, ఏదీ నోరు తెరువు! జ్వరము చూడనీ" అన్నాడు. టెంపరేచరు చూశాడు. నూటనాలుగు డిగ్రీలుంది. వెంటనే పనిమనిషిని పంపించి మంచు తెప్పిం

చాడు. తన డ్రైవరునింటికి పంపించి ఐస్ బ్యాగ్ తెప్పించాడు. ఒక గంటసేపు విరామంలేకుండా ఆమె తలపై మంచుపెట్టాడు. అమ్మయ్య, ఆమె టెంపరేచరు ఒక డిగ్రీ తగ్గింది. ఆమె మెల్లిగా కళ్లు తెరచింది. "ప్రకాశం, నాకు బాగానే ఉంది. పిల్లలసంగతి కొంచెం చూడు నాయనా" అంది హీనస్వరంతో.

శారద జ్వరము మలేరియా అని ప్రకాశరావు తెలుసుకున్నాడు. ఆమె రక్తము క్షీణించి చాలా బలహీనముగా ఉంది. కొన్ని ఇంజక్షన్లు మందులే కాకుండా కొంతకాలం పండ్లుపాలులాంటి బలమైన ఆహారంకూడా ఇస్తేతప్ప ఆమె ఆరోగ్యం బాగుపడదు. ఆమెకు క్వైనైన్ ఇంజక్షన్లు ఇచ్చాడు. మూడురోజులకి టెంపరేచరు నార్మలుకివచ్చింది. కాని చాలా నీరసంగా ఉంది. అతను వీలైనంత సేపు వారి ఇంట్లోనే గడుపుతున్నాడు. ఆమెకు నియమప్రకారము ఆహారము, మందులు అన్నీ తనే స్వయంగా ఇస్తున్నాడు. పిల్లల్ని జాగ్రత్తగా చూచుకుంటున్నాడు. అయిదారురోజులయేసరికి శారద కొంచెం లేచి తిరగడం మొదలుపెట్టింది. ఆమె పిల్లలకొరకు ఏ చిన్నపని చెయ్యబోయినా, ఆ పనులన్నీ తానే చేసేవాడు ప్రకాశం. ఆమెకు అవసరమైన మందులు పండ్లు, పాలు, అన్నీ తనే ఏర్పాటుచేశాడు.

ఆ రోజు ఆదివారం. ఆనందరావు ఊరికివెళ్ళి వారంరోజులయింది. సోమవారంనాడు వస్తున్నానని ఉత్తరం వ్రాశాడు. ప్రకాశరావుకి ఆరోజు మధ్యాహ్నము పనిలేదు. అందుకని రెండుగంటలకే శారద ఇంటికి వెళ్ళాడు. పిల్లలు పార్కుకి వెడతామని పేచీపెట్టారు. వాళ్ళిద్దరిని డ్రైవరుతో కారులో పార్కుకి పంపించాడు. శారద వాలుకుర్చీలో పడుకుంది. ఆమెకు సమీపంలోనే ఒకకుర్చీలో కూర్చుని మెల్లిగా అన్నాడు: "శారదా, నీవంట్లో కొంచెం తేలికగా ఉందా?"

"ఎందుకు ఉండదు? కష్టమంతా నీది, ఫలితం మాది. ప్రకాశం, నువ్వెంత శ్రమపడ్డావు ఈ వారంరోజులనుంచీ? నువ్వు ఖర్చుచేసిన సొమ్ము మాట చెప్పే అక్కర్లేదు. పిల్లల్ని ఎంత జాగ్రత్తగా కాపాడావు! నిజంగా నువ్వే ఈ సమయములో ఈ ఊళ్లో లేకపోతే నేనూ, పిల్లలు ఏమయిపోయిఉందుమో" అంది శారద.

"అలా అనకు శారదా, నేనుకాకపోతే మరొకరు సాయంచేస్తారు. ఊరంతా గొడ్డుపోయిందా? నీలాంటి అమాయకులు కష్టపడుతూంటే ఎవరో ఒకరు సాయంచేస్తారు. ఇంతకూ నేను చేసినదేముంది? చెప్పినట్లల్లా మందుపుచ్చుకుని ఆహారం తీసుకున్నావు కనుక త్వరగా నయమయింది. ఏ మాటకామాటే చెప్పాలి. నీ పిల్లలుకూడా బుద్ధిమంతులు కనుక సరిపోయింది" అన్నాడు.

శారద తిరిగి మొదలుపెట్టింది- "చూడు ప్రకాశం, నువ్వెన్నైనా చెప్పు, నీ ఋణం నేను నిజంగా తీర్చుకోలేను. అయినా ఒక్కమాటడుగుతా చెప్పు. ఏదో ఒక సంబంధం నిశ్చయించుకుని పెళ్ళిచేసుకోక ఇంకా ఎన్నాళ్లు ఇలా కాలం గడుపుతావు? చూడు ఆ రామారావుగారి కూతురు కమల ఇంటరుచదువుతోంది. చక్కగా ఉంటుంది. కట్నం వెయ్యిరూపాయిలయినాసరే, పిల్లని నీకే ఇవ్వాలని గట్టిగా పట్టుపట్టుక కూర్చున్నాడుటాయన, మొన్న మీ అన్నయ్య అన్నారు. ఏమంటావు?" అంది.

"అనడానికేముంది? ఆపిల్ల నాకు నచ్చలేదు" అన్నాడు ప్రకాశం.

"అయితే నీకు నచ్చినపిల్ల ఎవరైనా ఉందా?" అంది శారద అమాయకంగా.

ఆ ప్రశ్న వినగానే ప్రకాశరావు గుండెలు జల్లుమన్నాయి. కాని వెంటనే తమాయించుకున్నాడు.

"మాట్లాడవేం ప్రకాశం?" అంది శారద.

"ఆఁ, ఉంది" అన్నాడు ప్రకాశం అప్రయత్నంగా.

"అయితే ఇన్నాళ్ళనుంచీ చెప్పవేం? నేను వెళ్ళి సంబంధం నిముషంలో నిశ్చయంచేసుకువచ్చేదాన్నిగా" అంది.

"నిజమే, నీకు నామీద అంత అభిమానం ఉందని నాకు తెలుసు. కాని ఆ సంబంధం దాటిపోయి చాలారోజులయింది" అన్నాడు.

"దాటిపోయిందా, సరే అయిపోయినదేదో అయిపోయింది. దాటిపోయినదానికోసం బెంగపెట్టుక కూర్చుంటావా? ఏదో ఒక సంబంధం

చూచుకుని ఇప్పుడైనా త్వరగా నిశ్చయించుకో"

"శారదా, అది నాచేతకాని పని. అయినా ఇప్పుడు నాకేంలోటు? నేను తృప్తిగానే జీవిస్తున్నాను. పెండ్లిచేసుకోవలసిన అగత్యం నాకేమీ కనపడటంలేదు" అన్నాడు.

శారద కొంచెమాగి అన్నది: "అయితే ఆ అమ్మాయి ఎవరో చెప్పావుకావు?"

"శారదా ఆ అమ్మాయి ఎవరో తెలుసుకోవడంవల్ల ఏం లాభం? కాదూ కూడదంటే చెబుతాను. నువ్వుమాత్రం నన్ను అపార్థం చేసుకోనని వాగ్దానం చెయ్యాలి" అన్నాడు.

"అలా ఎప్పుడూఅనుకోకు ప్రకాశం. నీ రహస్యాన్ని భద్రపరచి కాపాడే విశాలహృదయము నాకుంది" అంది శారద.

"అంతేచాలు, నీ సానుభూతి ఉంటే నాకింకేం కావాలి? అయితే ఆ అమ్మాయి ఎవరో చెప్పకతప్పదంటావా?" అన్నాడు ప్రకాశం.

"తప్పదు" అంది శారద.

"అయితే ఆమె ఇప్పుడు ఇక్కడే నాకెదురుగా ఉంది. ఆమె భౌతికంగా నాకు యెంత సమీపంలో ఉందో, మానసికంగా అంత దూరములో ఉంది. చిన్నతనం నుంచీ నాకు తెలియకుండానే ఆమెను నేను ప్రేమించాను. ఆరాధించాను. ఆమెనుగురించి ఎన్నో కలలు కన్నాను. దైవవశాత్తూ ఆమె నా చెయ్యిదాటిపోయింది. ఇందులో ఎవరితప్పూ లేదు. ఇదంతా నా దురదృష్టము. నాలాంటి పరమ దౌర్భాగ్యునికి అటువంటి సుందరమూర్తి ఎల్లాదక్కుతుంది? అయినా నేను ఎంత మొండిగా జీవిస్తున్నానో చూడు. ఇప్పుడు నాకు మిగిలినది ఆమెసేవ ఒక్కటే. ఆ అవకాశమయినా ఇచ్చిన దయామయుడయిన ఆ దేవునికి రోజూ వెయ్యి నమస్కారాలు చేస్తున్నాను. నా జీవితానందం, నా హృదయతృప్తి అంతా ప్రస్తుతం నేనామెకు చేయగలిగిన సేవలోనే ఇమిడి ఉన్నాయి. బోధపడిందా, శారదా నన్ను దుర్మార్గునిగా ఎంచి నన్ను ఇకముందు నీ ముఖం చూడవద్దని తరిమివేస్తావేమోననే భయముతో ఇన్నాళ్ళనుంచీ ఈ విషయం నీతో నేనెప్పుడూ చెప్పలేను. ఇకముందు కూడా ఈవిషయము ఎప్పుడూ నీదగ్గర ఎత్తను." అని శారదవైపు చూచాడు.

శారద కళ్లు నీళ్ళతో నిండిఉన్నాయి. ఒక్క నిముషమామె దుఃఖంతో క్రుంగిపోయినట్టయిపోయింది. కాని ఆమె ఈవిధంగా జాలికి లొంగిపోదల్చుకోలేదు. పిచ్చి ఆదర్శాలను పెట్టుకుని పండులాంటి జీవితాన్ని ప్రకాశం పాడుచేసుకోడం ఆమెకెంతమాత్రమూ ఇష్టములేదు. అందులోనూ అతని జీవిత నాశనానికి తెలిసో తెలియకో తనే కారణమవడం ఆమెకు మరీ కష్టమనిపించింది. అతని మనస్సు ఎలాగయినా మార్చి వివాహానికి సుముఖంగా చేయడం తన కనీసధర్మమని ఆమె అనుకుంది. ఆమె తిరిగి ప్రారంభించింది: "ఇదిగో, చూడు ప్రకాశం! నీకు కొంచెం కూడా లోకానుభవం లేదు. ఎప్పుడో ఏదో అనుకున్నావని, అది జరగలేదని ఇల్లాగే ఉండిపోవడము ఏమంత ఘనత? ఈ రోజుల్లో ఎంతమంది అనుకున్న విధంగా జరక్కపోతే మనస్సు తిప్పుకుని మరోవిధంగా వివాహాలు చేసుకుని సుఖముగా ఉండడంలేదు? నాకెందుకో నీపిచ్చిపట్టుదల నచ్చడంలేదు. ఇంతకూ ప్రేమ అంటే ఏమిటి? మనకు ఎవరు సన్నిహితులుగా ఉంటారో వారిని మనం ప్రేమిస్తాము. కనుక ప్రేమించి సన్నిహితులను చేసుకోలేనప్పుడు సన్నిహితులను చేసుకుని ప్రేమించడం మంచిదికాదూ!" అంది.

ప్రకాశరావు ఏదో ఆలోచిస్తున్నట్టు కొంచెం సేపు పైకిచూచి అన్నాడు, "శారదా నువ్వుచెప్పేదేమిటో నాకుబోధపడడంలేదు. పోనీ ఇంతటితో ఈవిషయం వదిలివేద్దూ నీకు పుణ్యంఉంటుంది." శారద తిరిగి అన్నది: "నువ్వు అనుకుంటూన్నదంతా వట్టి భ్రమ. ఏదీ అలాగయితే నీ ప్రేమను పరీక్షిస్తాను. నిలబడగలవా? బాగా ఆలోచించి మరీ సమాధాన మియ్యి. నీ వనుకుంటూన్నట్టు నేనే నీ ప్రేమదేవతనైతే నేను ఏం చెయ్యమంటే అది చెయ్యాలి నువ్వు. అందుకు సిద్ధంగా ఉన్నావా?"

"నువ్వుచెప్పడం నేను చెయ్యకపోవడమూనా? ఎందుకు నీకీ సందేహం? చెప్పు. ఏం చెయ్యమంటావో చెప్పు. త్వరగా చెప్పు శారదా, నీ ఆజ్ఞను శిరసావహించే అదృష్టమే నాకు త్వరగా కలుగజెయ్యి" అన్నాడు దీనంగా.

"అయితే ఆ రామమూర్తిగారి కనులను వెంటనే పెండ్లిచేసుకో" అంది. శారద.

"శారదా, ఈ ఒక్కపనితప్ప ఇంకేం చెయ్యమన్నా చేస్తాను. క్షమించు. అప్పుడే నేను పరీక్ష ఓడిపోయానని నన్ను గేలిచెయ్యవద్దు. ఇంకొక అవకాశమియ్యి. ఈసారి కూడా ఓడిపోయానంటే అప్పుడు నీవు నన్నేమన్నా ఒప్పుకుంటాను" అన్నాడు ప్రకాశరావు.

"అదుగో చూశావా, ఇంతలోకే వెనుదిరిగిపోయావు! మాటలలో చెప్పడంకన్న చేతలలో చెయ్యడం ఎంత కష్టమో చూశావా? పోనీ ఈసారి చెబుతున్నాను చూడు, అదుగో, ఆ వరండా మధ్యవున్న రాతిస్తంభానికి నీ తల బద్దలు గొట్టుకో చూస్తాను!" అంది శారద నవ్వుతూ.

ఆ మాటలు ఆమె నోటినుండి వెడలిరాగానే అతడు ఒక్క క్షణం భయకంపితు డయాడు. వెంటనే "ఇదిగో ఆ పనే చేస్తున్నాను శారదా! ఎన్నిసార్లో గోడని పెట్టి తల బ్రద్దలుగొట్టుకోవాలనే కోరిక కలుగుతూండేది. కాని ధైర్యము చాలేది కాదు. నన్ను నువ్వు సరిగా అర్థము చేసుకున్నావు. నిజంగా నాలాంటి నిర్భాగ్యుడు చెయ్యవలసిన దింతకన్నా ఏముంది?" అని ఆగి కొద్ది క్షణాలు రెప్పవేయకుండా జాలిగా ఆమె ముఖంవైపు చూశాడు.

"అదుగో ఎంత సంశయిస్తున్నావో చూశావా రెండు నిముషాలు పోయాక 'పాపం వద్దులే' అని నేనంటానేమోనని నీ కాశగా ఉందికాదూ? నేనంత మెత్తని హృదయం కలదాన్ని కాదని నీ వీపాటికే గ్రహించి ఉండవలసింది. ఏం ప్రకాశం అలా చూస్తావేం? నా ఆజ్ఞ, శిరసావహించడానికి నీకు ధైర్యం లేకపోతే చెప్పేసెయ్యి, నిన్ను వదిలేస్తాను" అంది శారద.

ఆ మాటలు అతని హృదయానికి ములుకుల్లాగ గుచ్చుకున్నాయి. అతడు ఆ కొద్దిక్షణాలు ఆగినది పిరికితనంచేత కాదు. బహుశా తానింక ఆ ముఖమును చూడలేకపోతాడేమో నసే బాధతో ఆగాడు. ఆమె మాటలు వినగానే "ఇదిగో శారదా, నీవు చెప్పిన పని నిస్సంకోచముగా చేస్తున్నాను చూడు" అని చరచరా రాతిస్తంభంవైపు నడిచివెళ్ళాడు. అతడు స్తంభాన్ని సమీపించినకొద్దీ ఆమె కెందుకో కంగారు ఎక్కువయింది. నిజంగా అంత పనీ చేస్తాడా, అన్న భయముతో ఆమె గజగజ వణికిపోయింది. ఇంక రెండడుగులలో ఉన్నాడు. ఆమె గట్టిగా అరిచింది. "ప్రకాశం, వద్దు, వద్దు" అని బిగ్గరగా అరిచింది. ఆ మాటలేమీ అతని చెవిని పడలేదు. ఆ భీకరదృశ్యాన్ని చూడలేక ఆమె కన్నులు మూసుకుంది. ధన్నుమని శబ్దమయింది. ఆమెకళ్ళు తెరిచింది. ఏముంది? ప్రకాశం క్రింద పడిపోయి ఉన్నాడు. ఎంతలోతుగాయంపడిందో కూడా తెలియడానికి వీలులేకుండా అతని శిరస్సు నుదురు అంతా రక్తమయమయి ఉన్నాయి. నేలమీద కూడా రక్తము ప్రవహిస్తోంది. శారద కుర్చీ లోంచి లేవాలనుకుంది కాని కాళ్లు కదలలేదు. కళ్ళుతిరిగినట్టయిపోయాయి. "ఎంతపనిచేశాను, ఎంతపనిచేశాను? పాపాత్మురాలిని దేవుడు నన్ను క్షమించడు" అనుకుంటూ అతిప్రయత్నముమీద లేచి కాళ్ళీడ్చుకుంటూ అతనిదగ్గరకు వెళ్ళి అతని తలదగ్గర కూర్చుంది. ప్రయత్నము చేసి మెల్లిగా అతనితలను తన ఒడిలోకితీసుకుంది. పమిట కొంగు చింపి గాయములోంచి వస్తున్న రక్తాన్ని ఆపుదామని చూసింది. పనిమనిషిని మంచినీళ్లు తెమ్మని కేకేసింది. పనిమనిషి నీళ్లుతెచ్చి భయముతో ప్రశ్నలువేయడం మొదలుపెట్టింది. శారద విసుక్కుంది. "ఏముంది, స్తంభంతగిలింది, పడ్డాడు. తొందరగావెళ్ళి డాక్టరుని తీసుకురా, వాళ్ళ అమ్మనుకూడా త్వరగా రమ్మను" అంది. పనిమనిషి వెళ్ళిపోయింది.

కొంచెం సేపటికి రక్తస్రావము తగ్గింది. ప్రకాశరావు మెల్లిగా కళ్లు తెరచి చూశాడు. "అమ్మయ్య చనిపోలేదు" అనుకుంది శారద. శారద ముఖం తనకళ్ళకెదురుగాకనబడుతోంది. "నేనెంతఅదృష్టవంతుణ్ణి శారదా!" అన్నాడు. శారదముఖంలోని తృప్తి మాయమయిపోయింది. ఆమె రెండుకన్నుల నుండి రెండు పెద్దపెద్ద వేడినీటిబిందువులు అతని ముఖంమీద పడ్డాయి. ఉలిక్కిపడ్డాడు. ఆమె దుఃఖంతో ముఖము రెండు చేతులతో కప్పుకొని వెక్కివెక్కి ఏడవడం మొదలు పెట్టింది. ప్రకాశరావు హృదయం తరుక్కు

పోయింది. అతని జీవితంలో ఎన్నడూ ఎరుగనంతగా హృదయం బాధపడింది. "శారదా, నీకు పుణ్యముంటుంది ఏడవకు. ప్రపంచములో నేను సహించలేనిది నీ దుఃఖమొక్కటే అని ఇప్పుడు నేను తెలుసుకున్నాను. ఇకనో నువ్వేం చెయ్యమంటే అది చేస్తానుగా, ఎందుకు ఏడుస్తావు చెప్పు, నామాట వినవూ" అని ప్రాధేయపడ్డాడు. శారద దుఃఖాన్నంతనీ వెంటనే దిగమింగేసి అంది "అయితే నీకు నయమవగానే కమలని వివాహం చేసుకుంటావా?" "నాకు నిజంగా నయమయితే నీ సంతోషంకోరకు ఏంచెయ్యమన్నా చేస్తాను శారదా, సరేనా" అన్నాడు. ఆమె తృప్తితో మనస్సులోనే ఆశీర్వదించింది ప్రకాశరావుని.

కొంచెం సేపటిలో డాక్టరువచ్చాడు. గాయానికి కట్టుకట్టి ప్రకాశరావుని మంచంమీద పడుకోబెట్టారు. అతనితల్లికూడా వచ్చింది. అతనిని మూడు నాలుగు రోజులవరకూ కదపకూడదనీ, చాలా రక్తం నష్టమయిందనీ ప్రమాదస్థితిలో ఉన్నాడని డాక్టరు చెప్పాడు. శారద శ్రద్ధతో అతనికి సేవచేస్తోంది. మరునాడు ఆనందరావు వచ్చాడు. ప్రకాశరావుని మంచముమీద చూచి ఆశ్చర్యపోయాడు. శారద చెప్పింది. "మీరు వెళ్ళగానే నాకు జ్వరము వచ్చింది. పాపం రాత్రి పగలు నాకు వైద్యం చేశాడు. పిల్లల్నికూడా చూసుకున్నాడు. చివరకి నిన్న ఆ పాడు స్తంభంతగిలి పడిపోయాడు. ఇంతవరకు వచ్చింది". "అయ్యో నీకెంతదెబ్బ తగిలింది? ఇప్పుడయినా ఆ దేవుని దయవల్ల నయమయితే అంతే చాలు" అన్నాడు ఆనందరావు. మూడురోజులు గడిచాయి. ప్రకాశరావు పరిస్థితి ఏమీ బాగాలేదు. డాక్టరు చెయ్యవలసినదంతా చేస్తునేఉన్నాడు. నాలుగోనాడు సాయంకాలము ప్రకాశరావుకి ఒకవిధమైన ఆయాసము మొదలుపెట్టింది. తనింక జీవించనన్న సంగతి అతనికే తెలుస్తోంది. అన్నగారిని పిల్చి విల్లు పత్రము వ్రాయమన్నాడు. బ్యాంకులో ఇరువదివేల రూపాయిలున్నాయి. ఇల్లు అయిదు వేలరూపాయిలు తల్లికి, కారు ఆనందరావుకి, మిగిలిన పదిహేనువేలు శారదకి పిల్లలిద్దరికి. శారదా "కొంచెం మంచినీళ్లు" అన్నాడు. ఆమె చెమ్చాతో నీళ్లు అతని గొంతుకలో పోసింది. ఆ నీళ్లు అతని గొంతుక దిగనేలేదు, శారద ముఖంకేసి ఒక్కసారి చూచి అతను శాశ్వతంగా కళ్లు మూశాడు.



గౌతమ బుద్ధుడు. —చిత్రకారిణి : శ్రీమతి పి. విజయలక్ష్మి.